క్లుప్తంగా

హైదరాబాద్‌కు బస్సు ప్రారంభం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ డిపో పరిధిలో ఆర్మూర్ నుంచి వేల్పూర్, భీమ్‌గల్, సిరికొండ, గడ్కోల్, కామారెడ్డి మీదుగా హైదరాబాద్‌కు కొత్త సర్వీసు ప్రారంభించామని ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత గురువారం తెలిపారు. ప్రతిరోజు ఉదయం 5 గంటలకు ఆర్మూర్ నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సౌకర్యాన్ని వేల్పూర్, భీమ్‌గల్, సిరికొండ, గడ్కోల్ ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కమ్మర్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన శారదకు రూ.32 వేలు, లక్ష్మణ్‌కు రూ. 13 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సహాయం మంజూరు కాగా అందుకు సంబంధించిన చెక్కులను స్థానిక బీఆర్ఎస్ నాయకులు గురువారం బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చింత గణేష్, సర్పంచ్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

కోమన్‌పల్లిలో..

వేల్పూర్: కోమన్‌పల్లిలో ఇద్దరు బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను స్థానిక బీఆర్ఎస్ నాయకులు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పత్రి రాజేశ్వర్, దొనికెర నవీన్, ర్యాడ నర్సయ్య, కొత్తింటి మహేశ్, కలిగోట సతీష్, కొత్తింటి రాజన్న పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు..

బాల్కొండ: మెండోరా మండలంలో పలు గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం స్థానిక ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. స్థానిక ఎంపీపీ సుకన్య, జెడ్పీటీసీ తలారి గంగాధర్, డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ సతీష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సరస్వతి, స్థానిక సర్పంచ్ మచ్చర్ల లక్ష్మి, పీఏసీఎస్ ఛైర్మన్ మచ్చర్ల రాజారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బాబా, తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక



మాక్లూర్: కల్లెడి హోవార్డు పార్కు ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఆల్ ఇండియా సైనిక్ పాఠశాలలో ప్రవేశ పరీక్ష రాసి అర్హత సాధించారు. ఈ మేరకు గురువారం పాఠశాల యజమాన్యం అర్హత సాధించిన శివమణి, కృతిక, లీలా వర్ధినులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన



మాక్లూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో వరి పంటలను గురువారం జిల్లా వ్యవసాయ అధికారి రాయుడు తిరుమల ప్రసాద్ పరిశీలించారు. ఈసారి వరి పంటలకు కాండం తొలుచు పురుగు ఆశించి రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని విచారం వ్యక్తం చేశారు. నాట్లు వేసిన నాటి నుంచి తగిన సూచనలు, సలహాలు ఇచ్చినప్పటికీ వాతావరణంలో మార్పుల కారణంగా తెగుళ్లను సమయానికి నివారించుకోవటం కష్టతరమైందన్నారు. ఇక ముందు తీసుకోవాల్సిన జాగ్రతలను రైతులకు వివరించి చెప్పారు. మండల వ్యవసాయ అధికారి పద్మ, వ్యవసాయ విస్తరణ అధికారి ఉమాదేవి ఉన్నారు.

గుడిసెల తొలగింపు

ఎడపల్లి(బోధన్): నెహ్రూనగర్ గ్రామ శివారులో జానకంపేట చెరువు శిఖం భూమిలో నెహ్రూనగర్ గ్రామస్తులు వేసిన గుడిసెలను గురువారం రెవెన్యూ సిబ్బంది తొలగించారు. శిఖం భూమిలో సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేశారని స్థానికులు తహసీల్దార్ శేఖర్‌కు ఫిర్యాదు చేయడంతో తహశీల్దార్, శిఖం భూమిలో వేసిన గుడిసెలను రెవెన్యూ సిబ్బందితో తొలగింపజేశారు. శిఖం భూముల కబ్జాకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

తొలగించొద్దని ఎమ్మెల్యేకు వినతి

బోధన్: ఎడపల్లి మండలంలోని నెహ్రూనగర్ గ్రామ పేదలు ప్రభుత్వ భూమిలో వేసుకున్న నివాస గుడిసెలను తొలగించొద్దని సీఐటీయూ నాయకులు బాధితులతో కలిసి వచ్చి గురువారం బోధన్‌లో ఎమ్మెల్యే షకీల్‌ను కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందించారు. ఎడపల్లి తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి గుడిసెవాసులను ఇబ్బంది పెట్టవద్దని సూచించారని సీఐటీయూ నాయకులు తెలిపారు.

ప్రీతికి ఘన నివాళులు

బాల్కొండ: సీనియర్ మెడికో సైఫ్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న మెడికో ప్రీతికి గురువారం రాత్రి ముప్కాల్ మండల కేంద్రంలో స్థానిక యువజన సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ఘన నివాళులు అర్పించారు. భవిష్యత్తులో ఇలాంటికి పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి

కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరను పెంచడాన్ని నిరసిస్తూ గురువారం బోధన్, ఆర్మూర్, బాల్కొండ పరిధిలో బీఆర్ఎస్ నేతలతో పాటు వివిధ పార్టీల కార్యకర్తలు ఆందోళనలకు దిగారు. కట్టెల పొయ్యిపై వంట చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. పలు చోట్ల రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు వ్యతిరేకంగా పాలన సాగిస్తుందంటూ బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. – సాక్షి నెట్‌వర్క్



వేల్పూర్ మండల కేంద్రంలో కట్టెలతో వంట చేస్తూ నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు



నందిపేటలో..



బాల్కొండ మండల కేంద్రంలో..



ముప్కాల్ మండల కేంద్రంలో..



మాక్లూర్‌లో ..



కమ్మర్‌పల్లిలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



బోధన్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ..



ఆర్మూర్ పట్టణం అంబేడ్కర్ చౌరస్తా వద్ద ..



బోధన్‌లో.. సీపీఐఎంఎల్ ప్రజా పంథా నేతలు

సంక్షేమం, అభివృద్ధే మా ప్రభుత్వ లక్ష్యం

- బోధన్ నియోజకవర్గంలో రూ.2 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశాం
- బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్



అమ్దాపూర్‌లో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

బోధన్‌రూరల్(బోధన్): అన్నివర్గాల ప్రజల సంక్షేమం, అన్ని ప్రాంతాల అభివృద్ధే మా బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష్యమని బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అన్నారు. గురువారం అమ్దాపూర్, సంగం గ్రామాల్లో ఎమ్మెల్యే షకీల్ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అమ్దాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు రూ.కోట్లల్లో నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. బీజేపీలో ఉన్నవారు మాత్రమే హిందువులు, ఇతర పార్టీల్లో ఉన్నవారు హిందువులు కాదన్నట్లు బీజేపీ వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే షకీల్ మండిపడ్డారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా తెలంగాణలో అమలవుతున్న పథకాలు ఉన్నాయా అని బీజేపీని ప్రశ్నించారు. గ్యాస్ ధరలు, నిత్యావసర ధరలు నియంత్రించడంతో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి బోధన్ నియోజకవర్గంలో రూ.2 వేల కోట్లతో అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేశానని చెప్పారు. తా ను చేసిన అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు సి ద్ధమని సవాల్ విసిరారు. ఎంపీపీ బుద్దె సావిత్రి, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్లు శరత్, గం గారెడ్డి, సర్పంచ్‌లు మంజుల, అంజమ్మ ఉన్నారు.

విద్యార్థి ప్రయాణంలో ఇంటర్ కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహ్మద్ షకీల్

బోధన్‌టౌన్(బోధన్): విద్యార్థి ప్రయాణంలో ఇంటర్మీడియట్ కీలకమని, చక్కగా చదువు కుంటే భవిష్యత్ బంగారుమయంగా ఉంటుందని ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వార్షిక స్పోర్ట్స్ డేకు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతీ విద్యార్థి పట్టుదల, క్రమ శిక్షణతో చదువుకోవాలని, తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు. కళాశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి అనుగుణంగా రూ.కోటి మంజూరు చేస్తున్నానని, ఈ నిధులతో కళాశాల ఆవరణలో ఆడిటోరియం నిర్మించాలని, ఈ భవనాన్ని 4 నెలల్లో పూర్తి చేసేలా చర్యలు చేపడుతానని, వారం రోజుల్లో భూమి పూజ చేద్దామన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ప్రభుత్వ మధుమాలాంచ జూనియర్ కళాశాల భవన మరమ్మతులకు నిధులు కేటాయించాలని కళాశాల ప్రిన్సిపాల్ కల్పన కుమారి ఎమ్మెల్యేను కోరారు.

సంక్షిప్తం

✤ తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలి

పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని ఆర్ఎస్ఎస్ సామాజిక సామరస్య వేదిక ఉమ్మడి రాష్ట్రాల ఆర్గనైజర్ అప్పాల ప్రసాద్ అన్నారు. ఆర్మూర్ మండలం చేపూర్ తిరుమల గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో గురువారం క్షత్రియ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. అప్పాల ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

✤ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

రెంజల్(బోధన్): విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులదేనని ఎంఈవో గణేశ్‌రావ్ అన్నారు. సాటాపూర్‌లోని యూనిక్ పాఠశాల 12వ వార్షికోత్సవ వేడుకలను గురువారం నిర్వహించారు. ఎంఈవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

✤ విఠలేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రుద్రూర్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన విఠలేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు హారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. శుక్రవారం జరిగే కార్యక్రమాలకు మాధవానంద సరస్వతి స్వామి, బాలయోగి పిట్ల కృష్ణ మహరాజ్, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరవుతారని ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.

✤ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ సందర్శన

ఎడపల్లి(బోధన్): జానకంపేట శివారులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎస్.సుప్రియ గురువారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సంబంధిత వివరాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

✤ పర్యావరణ పరీక్షకు హాజరుకావాలి

ఆర్మూర్‌టౌన్: ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు నైతిక విలువలు, పర్యావరణ పరీక్షలకు కచ్చితంగా హాజరు కావాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నర్సయ్య గురువారం తెలిపారు. విద్యార్థులు ఈ నెల 4న నైతిక విలువల పరీక్ష, 6న పర్యావరణ పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు కొనసాగుతాయని అన్నారు.

✤ కోటగిరి జీపీకి వైకుంఠరథం అందజేత

రుద్రూర్: ప్రముఖ వ్యాపారవేత్త పోల విఠల్‌రావ్ ఆధ్వర్యంలో కోటగిరి గ్రామ పంచాయతీకి పోల రాఘవేంద్ర, దీప్తి స్మారకార్థం వైకుంఠరథం అందజేశారు. కార్యక్రమంలో బాన్సువాడ సెగ్మెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి, సర్పంచ్ పత్తి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం

కోటగిరి మండల కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం పోల విఠల్‌రావ్ నిర్మించిన రెండు బస్‌షెల్టర్‌లను గురువారం ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. పోల రాఘవేంద్ర, దీప్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బస్ షెల్టర్‌లను నిర్మించారు.

✤ జీవాలకు నట్టల నివారణ మందులు

మాక్లూర్/రుద్రూర్: మాక్లూర్ మండలంలోని మాణిక్‌భండార్, రాంచంద్రపల్లి, మాణిక్‌భండార్ తండాలలో, రుద్రూర్ మండలం ఎక్లాస్‌పూర్ గురువారం పశు వైద్యాధికారులు ఉచిత శిబిరాలు నిర్వహించి, జీవాలకు నట్టల నివారణ మందు వేశారు. గొర్రె, మేకల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపేయాలి



బాల్కొండ: మండల కేంద్రంలోని సర్వే నంబర్–1331లో గల వక్ఫ్ బోర్డు భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపేయాలని తహసీల్దార్ వినోద్‌కు గురువారం సమాచార హక్కు చట్టం డివిజన్ అధ్యక్షుడు ఖాజీ అన్సర్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలకేంద్రంలోని ప్రభుత్వ భూముల్లో అనేక అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సర్వే నంబర్లు వేరు వేరుగా ఉన్నా పట్టించుకోకుండా నిర్మాణాలకు అనుమతివ్వడంపై మండిపడ్డారు.

పట్టణంలోనికి భారీ వాహనాలను అనుమతించొద్దు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోనికి అధిక లోడ్ గల వాహనాలు రావడంతో ప్రజలు ఇబ్బందులు కలుగుతున్నాయని, ఈ వాహనాలను బైపాస్ మీదుగా అనుమతించాలని బీజేపీ నియోజకవర్గ నాయకులు అడ్లూరి శ్రీనివాస్ కోరారు. గురువారం బోధన్ ఎస్సై నవీన్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అధిక లోడ్, భారీ వాహనాల రాకపోకల వల్ల ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సరైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రైవేటు పాఠశాల ఎదుట ధర్నా



ఆర్మూర్‌టౌన్: హైదరాబాద్‌లో శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న సాత్విక్ అనే విద్యార్థి అధ్యాపకులు, యాజమాన్యం ఒత్తిడి భరించలేక ఆత్మహత్యకు పాల్పడటాన్ని బీజేవైఎం తీవ్రంగా పరిగణిస్తూ ఆర్మూర్‌లోని శ్రీ చైతన్య పాఠశాల ముందు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మందుల బాలు మాట్లాడుతూ.. కార్పొరేట్ కళాశాలలు విద్యార్థులను భౌతికంగా, మానసికంగా హింసించడం సరికాదన్నారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలల విషయంలో ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు.

జిల్లా ఉద్యమానికి ఎంఎస్‌పీ మద్దతు



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించా లని డిమాండ్‌తో న్యాయవాదులు చేపట్టిన ఉద్యమానికి ఎంఎస్‌పీ (మహాజన సోషలిస్టు పార్టీ) నా యకులు మద్దతు తెలిపారు. ప్రత్యేక జిల్లా సాధన కోసం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 74వ రోజుకు చేరాయి. దీక్షలో ఎంఎస్‌పీ నాయకులు లక్ష్మిగారి భూమయ్య, పానుగంటి భరత్ కుమార్, నర్సింగ్‌రావు, శ్రీకాంత్, కె.గంగాధర్‌లు కూర్చున్నారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంగారెడ్డి, న్యాయవాదులు హన్మంత్‌రావు, కులకర్ణి దత్తాత్రిరావు, అడ్లూరి శ్రీనివాస్, రమేశ్‌లు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. ప్రమాదకరంగా కల్వర్టు



నవీపేట: మండల కేంద్రంలోని నవోదయ జూనియర్ కాలేజీతో పాటు సుభాష్‌నగర్‌కు వెళ్లే దారిలో నిజాంసాగర్ డి–50 ప్రధాన కాలువ కల్వర్టులకు మరమ్మతులు కరువయ్యాయి. కల్వర్టు అంచు భాగం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో కాలనీవాసులు, విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయంపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: బలరామ్, డీఈఈ, ఇరిగేషన్

ఫోన్ నంబర్ : 99082 79879

దేశానికే ఆదర్శం కంటి వెలుగు



కంటి అద్దాలు అందజేస్తున్న చైర్‌పర్సన్ వినీత

ఆర్మూర్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శమని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని 31, 13వ వార్డుల్లో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎవరు కూడా కంటి సమస్యలతో బాధ పడకూడదని రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

మాక్లూర్: గుంజ్లిలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ గుండారం శేఖర్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకుడు గోపు రంజిత్, లక్ష్మి, మహేష్, విజయ్, నర్సయ్య పాల్గొన్నారు.

కల్యాపూర్‌లో..

రెంజల్(బోధన్): కల్యాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక సర్పంచ్ కాశం నిరంజని ప్రారంభించారు. డాక్టర్లు వినయ్‌కుమార్, కావ్య, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ కాశం సాయిలు, ఆరోగ్య విస్తరణ అధికారులు కరిపే రవీందర్, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికి కంటి పరీక్షలు నిర్వహించాలి

పెర్కిట్(ఆర్మూర్): అర్హులైన ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు చేయాలని జిల్లా పరిశీలకుడు డాక్టర్ వెంకటేష్ సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ 20వ వార్డులో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ప్రతి రోజు తమకు ఇచ్చిన లక్ష్యం మేరకు కంటి పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

విద్యుత్ శాఖ సమస్యలపై స్పందించాలి

- టీఎస్‌పీఈఈ జేఏసీ బోధన్ ఛైర్మన్ ప్రసాద్



నిరసన తెలియజేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

బోధన్‌రూరల్(బోధన్): విద్యుత్ శాఖలోని ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం, యాజమాన్యం తక్షణం స్పందించి న్యాయమైన తమ డిమాండ్లను నెరవేర్చాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్(టీఎస్‌పీఈఈ) జేఏసీ బోధన్ ఛైర్మన్ శివ ప్రసాద్ అన్నారు. విద్యుత్ శాఖ ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం టీఎస్‌పీఈఈ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. బుధవారం బోధన్ డివిజన్ ట్రాన్స్‌కో కార్యాలయంలో లంచ్ అవర్‌లో విద్యుత్ ఉద్యోగులు తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ బోధన్ ఛైర్మన్ శివ ప్రసాద్ మాట్లాడుతూ.. గత సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి ఇవ్వాల్సిన పీఆర్‌సీపై కాలయాపనతో తాము నష్టపోతున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగుల సమస్యలపై సీఎం కేసీఆర్ దృష్టి సారించి తమ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈపీఎఫ్ టూ జీపీఎఫ్ అమలు చేయాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మెకు సైతం వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఏడీఈలు బెనర్జీ, రవి కుమార్, కన్వీనర్ కల్యాణ్, కో కన్వీనర్ గంగాధర్, కోశాధికారి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి



మాక్లూర్: రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా నాయకుడు అభిలాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం షాపూర్‌లో మండల యువజన విభాగం అధ్యక్షుడు ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగిన యువజన కార్యకర్తల సమావేశానికి అభిలాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డిని మూడవసారి కూడా గెలిపించి మంత్రి పదవి వచ్చేలా కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. స్థానిక సర్పంచ్ మురళి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

'మహిళల హక్కులు కాలరాస్తున్నారు'



కమ్మర్‌పల్లి: స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా పాలకులు మహిళల హక్కులు కాలరాస్తున్నారని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోదావరి పేర్కొన్నారు. గురువారం కమ్మర్‌పల్లి పీవోడబ్ల్యూ కార్యాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు రాజకీయ, ఉద్యోగ రంగాల్లో రాణిస్తున్నా మహిళ అనే వివక్ష కారణంగా సమాజంలో ముందుకెళ్ల లేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో లైంగిక వేధింపులతో వారిని వంటింటికే పరిమితమయ్యేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సమాచారం..

5న అవార్డుల ప్రదానం

మాక్లూర్: అడవి మామిడిపల్లిలోని అపురూప కల్యాణ మండపం వేదికగా ఈ నెల 5న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరుగుతుందని ప్రముఖ రచయిత్రి అమృతలత వెల్లడించారు. గురువారం మండలంలోని అపురూప కల్యాణ మండపం వద్ద ఆమె మాట్లాడారు. 2022– 23కు గాను అమృతలత జీవన సాఫల్య పురస్కారాలు, 2021, 2022, 2023 గాను ఇందూరు అపురూప అవార్డుల ప్రదానం ఉంటుందన్నారు.

దరఖాస్తుదారులు కార్యాలయానికి రావాలి

బోధన్‌టౌన్(బోధన్): మైనార్టీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు అందిస్తున్న రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 4న మున్సిపల్ కార్యాలయానికి ఉదయం 11 గంటలకు రావాలని కమిషనర్ ఖమర్ అహ్మద్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బోధించడానికి మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ధనవేణి తెలిపారు. ఆంగ్లం, తెలుగు, కంప్యూటర్‌సైన్స్, రసాయన శాస్త్రం సబ్జెక్టులలో బోధించటానికి అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పీజీ 55 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈనెల 7 లోపల ధృవీకరణ పత్రాలు కళాశాలలో సమర్పించాలని, 10న డెమో, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు.